
# గురి తప్పింది!

కె. రామలక్ష్మి



డియర్ పార్వతీ,

"నీకు తప్పించి ఇలాంటి ఉత్తరం ఇంకెవరికీ రాయలేను. పూర్తిగా చదువు.

ప్రొఫెసరు కృష్ణమూర్తికి అందమైన ముఖంఉంది. సుసంపన్నమైన మేధ ఉంది. అయితే ఏంలాభరీ ? కృష్ణమూర్తికి హృదయం లేదు. అక్కడా మెదడే ఉంది. మానవత్వం ఏ టార్చివేసి చూసినా అతనిలో కనబడదు,

విదేశీ ప్రముఖులు వస్తే బ్రహ్మాండమైన పార్టీ ఏర్పాటు చేశారు కాలేజీవాళ్ళు. ఆ పార్టీలో మేం కలుసుకోవడం జరిగింది. ప్రిన్సిపాలుగారూ, వారి భార్యా చాలా సహృదయులు. కాని నన్నెందుకు ఆహ్వానించారో ఓ పట్టాన బోధపడలేదు. బహుశ, అటువంటి మేధావంతులకు తగిన ప్రేక్షకులుగా

నా వంటి బుర్ర తక్కువ వాళ్ళం... గాని సంభాషణ రాణించదనుకున్నారేమో! తెలియలేదు.

అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరూ ఏదో విషయంలో నిధులవంటి వాళ్ళే. చాలా మటుకు వారి సంభాషణ నాతలవాటి గాలిలో తేలిపోయిందనే చెప్పాలి. మొహముఖం కనబడనీయకుండా తెలివితేటలు ప్రదర్శిస్తూ అంతసేపు కూర్చోవడం - ఓర్పుకి పరీక్షే. ఓ గంటా గంటన్నర గడిచేసరికి నా పరిస్థితి ఆవలింతల స్థితికివచ్చింది. ఏం జరుగుతోందో తెలియకుండానే అంతా వెళ్ళిపోవడానికి సిద్ధపడుతున్నారు.

'బాగా ఆలస్యం అయిపోయింది. నిన్ను కృష్ణమూర్తిగారుకారులో దింపేస్తారు వెళ్ళు ఉషా' అంటూ నా బాధ్యత ప్రొఫెసర్ గారికి అంటకట్టారు ప్రిన్సిపాలు గారి భార్య.

కారులో కూర్చున్నానేగాని ఒక్క ఉలుకూ పలుకూలేదు. రోడ్డుకికళ్ళు, కారుకి చేతులు అప్పగించి కారుతోలుతున్నారు కృష్ణమూర్తిగారు. వారి ప్రక్కన కూర్చున్న నేను ఓ కర్ర బొమ్మనో, లేకుంటే ఇంకో కాపుకాదుడినో అయి ఉండవచ్చు.

పాపం! ప్రొఫెసరుగారు మాట్లాడారు.

కాని నేను వినీ విననిస్థితిలో ఉన్నాను. వస్తున్న ఆవలింతలు ఆపుకొంటూ రహస్యముగా వినీ వినబడనట్టు 'అంతే, ఆహా, అలాగా, ఊ' అని అడపా తడపా సమాధానం చెప్పుతూ కూర్చున్నాను.

నన్ను ఇంటి దగ్గర దింపుతూ చాలా ఆప్యాయంగా "మళ్ళీ ఎప్పుడేనా ఇలాగే కలుసుకుందాం" అన్నారు కృష్ణమూర్తిగారు.

ఆ క్షణంలో గడ్డిపోచతో కొట్టినంతే వేలకి ఒరిగి ఉందనుకో.

"ఇంత అందంగా ఉండి, ఇంత తెలివితేటలు గల అమ్మాయిలు చాలా అరుదు. నీ పరిచయం కలిగినందుకు నా కెంతో సంతోషంగా ఉంది" అన్నారు.

నాకు ఊపిరి ఆడలేదు!

అదే ప్రారంభం అనుకో.

తరువాత రోజులూ, వారాలూ దొర్లిపోయాయి. దొర్లిపోయాయి. కాని ఈ మెదడు గారిని మనిషిగా మార్చాలనే నా ప్రయత్నాలు అంతంతమాత్రంగానే ముందడుగు వేశాయి. తరుచుగా కలుసుకొంటూ ఉండేవాళ్ళం. కాలేజీ అయిపోగానే బీచికి వెళ్ళేవాళ్ళం. గ్రంథాలయాలు చుట్టేవాళ్ళం. ఉట్టినే అలా తిరిగి వస్తూ ఉండేవాళ్ళం.

కాని ఎంతకాలం అని ఇలా తెలిసీ తెలియని తెలివితేటలు ప్రదర్శించ గలను? ఎంత కాలం అలా శూన్యంలోకి చూస్తూ అదే నా తెలివి అని నమ్ముతున్న ఆయన పక్కన కూర్చోవడం? ఏ లాభంలే దనిపించింది. నెలజీతం రాగానే పుస్తకాలు కొనడం ప్రారంభించాను. ఒకటేమిటి? సైన్సు, అస్ట్రానమీ, ఫిలాసఫీ. వాటితో కుస్తీపట్లు ప్రారంభించాను. నా పాత రోజుల పుస్తకాలు పైకి తీసి దులిపాను. నా బుర్రకి మెరుగులు పెట్టడం ప్రారంభించాను.

మొదట్లో ఇది చాలా కష్టమైన పనే. ప్రాణం పోయింది. అయితేనేం? తినగాతినగా వేము తియ్యన అన్నారుకదా? ఇవన్నీ చదివి చదివి కృష్ణమూర్తిగారు అడిగినప్పుడు, అడగనప్పుడు తెలివిగా ప్రశ్నలు వేయడం నేర్చుకున్నాను. ఇలా ఒకటి రెండు తెలివైన ప్రశ్నలు వేస్తే చాలు. ఎంతసేపైనా మాట్లాడకల రాయన! సైన్సులో ఎంత గట్టివారో ఇతర విషయాలలో అంత ఆసక్తి ఉంది ఆయనకి. నడిచే విజ్ఞాన సర్వస్వం అనుకో. గంటలకొద్దీ ఆయన చెప్పేది వింటూ ఉండేదాన్ని. వాటి మీదా వీటిమీదా తన థియరీలు చెప్పేస్తూ ఉండేవారు ఆయన. ఒక్కొక్కప్పుడు ఆయన చెప్పేది అర్థం అయ్యేది. బుర్ర కెక్కేది. కాని తరుచు ఆయన అలా తీక్షణంగా మాట్లాడుతూంటే, పక్కవాటుగా ఆయన అందమైన ముఖంచూస్తూ 'ఈ మానవుడూ, ఈ మెదడూ ఎప్పటికేనా మనిషి అవుతాడా? నన్ను దగ్గరికి తీసుకుంటాడా?' అని ఆలోచిస్తుండేదాన్ని.

ఒకసారి శాస్త్రీయ సంగీత కచ్చేరీనుంచి తిరిగి వస్తూంటే - నేను ఎన్నాళ్ళనుంచో ఎదురుచూచినది జరిగింది. అప్రయత్నంగా ప్రొఫెసరుగారి చేయి నా చేయిమీద పడింది. అలాగే నా చేతిని గుప్పిట పట్టుకున్నారు. వింతగా నా ముఖంలోకి చూశారు. నా ఒళ్ళు పులకరించింది. నే కన్న కలలు నిజం అయాయి. హఠాత్తుగా ముందుకి వంగి నా చెంపమీద ముద్దు పెట్టుకున్నారు. మరుక్షణంలోనే నా చేయి వదిలేస్తూ 'క్షమించు ఉషా, నా కీ రోజు ఏమైంది?' అంటూ తెగ బాధపడ్డారు. 'నీలాంటి తెలివైనదానికి ఇలాంటివి అసహ్యంగా ఉంటాయి. నన్ను క్షమించు' అంటూ కారు స్టార్టు చేశారు. 'నే నెందుకిలా చేశానో నాకే అర్థంకాలేదు. ఇక పైఎప్పుడూ ఇలా జరగదు క్షమించు' అని పదే పదే క్షమార్పణ వేడారు.

"మనిషిలా ప్రవర్తించినందుకు క్షమార్పణ అనవసరం మాష్టారూ" అన్నాను సాధ్యమైనంత దిలిపిగానే.

"చాలా సంతోషం. మామూలు స్త్రీలైతే నన్ను అపార్థం చేసుకొనేవారు" అంటూ గొణిగారు కృష్ణమూర్తిగారు.

ఇది జరిగాక మా స్నేహం పూర్వంలాగే చాలా ఉన్నతంగా, ఆదర్శవంతంగా, మేధా సౌధాల ప్రాంగణాలలోనే నడిచింది. ఎక్కడా చెక్కు చెదరని ఈ మేష్టారిమీద నాకు కోపం వచ్చింది. జాలి వేసింది. ఆనాటి సంఘటనని పూర్తిగా మరిచిపోయాం.

ప్రొఫెసరు గారితో కలిసి అటూ ఇటూ తిరగని సమయంలో పుస్తకాలతో కుస్తీ పట్టేదాన్ని. కాలం జరగను నల్లరాళ్ళు సహితం కరిగినట్టు నా యీ పట్టుదలకి అతి క్లిష్టమైన గ్రంథాలు దాసోహం అన్నాయి. ఇది వరకు లాగా మేష్టారు చెప్పినదానిని వినడంతోపాటు నా వ్యక్తిగత అభిప్రాయాలను సహితం చెప్పడం ప్రారంభించాను. ఇంకా పుస్తకాలు కొన్నాను....

ఉన్నట్టుండి, ఒకసారి ప్రొఫెసరుగారు రెండు వారాలు సెలవుపెట్టారు. తిరిగి రాగానే వివరాలు చెప్తాను అన్నారు. కొత్త థియరీ

No Worry for Printing

**USE GANGES PRINTING INKS**

For

Fine & Best results

***

Factories :

CALCUTTA, BOMBAY, MADRAS, DELHI.

***

Stockists :

Guntur and Krishna District for all varieties of papers.

***

Contact :

**Venkata Kanaka Durga Paper & Stationery Mart,**

GANDHINAGAR, VIJAYAWADA-3

మీద కూర్చుంటున్నారేమో అనుకున్నాను నేను

వారాలు గడిచాయి. నేను ఇంకా ఇంకా పుస్తకాల పురుగులాగా తయారైనాను.

ఉన్నట్టుండి ఆ రాత్రి ఫోను వచ్చింది. నేను 'న్యూక్లియోనిక్స్'తో (నీకు అర్థం కాదులే!) కుస్తీ పడుతున్నాను.

ప్రొఫెసరుగారు చాలా సరదాగా ఉన్నట్టున్నారు.

"నీకో విషయం చెప్పాలి" అన్నారు.

"చాలా సంతోషమైనదా?" అన్నాను.

"నువ్వు అలాగే అనుకోవాలని నా కోరిక. నిజానికి ఉత్సాహం కల్గించినది నీవే మరి" అన్నారు.

"నేనా!" అని ఏమిటై ఉంటుంది చెప్మా, అని బుర్రబద్దలు కొట్టుకున్నా ఏమీ తట్టలేదు.

"అదేంటమ్మ. నీకూ తెలియకుండానే నాలో ఉత్సాహం నువ్వు కల్గించావు. నీకు జ్ఞాపకం ఉందా ఆరోజు? నీ చెంపమీద ముద్దు పెట్టుకున్నానే? ఆ రోజునుండే నా జీవితంలో ఉన్న లోటు ఏమిటన్నది గ్రహించాను" అన్నారు కృష్ణమూర్తిగారు హుషారుగా.

నా హృదయం ఉప్పొంగి పోతూంది. నా కంఠం పూడుకుపోతూంది. అయినా తేలికగా

"రొమాంటిక్ ఎలిమెంట్!" అన్నాను.

"కరెక్ట్! నీకు జ్ఞాపకం ఉందా? ఒక రోజు నా స్నేహితుని ఇంటిముందు కారు ఆపి లోపలికి వెళ్ళి బెమరుగొడ్డులాగా తిరిగి వచ్చాను!"

"జ్ఞాపకం లేకేం? అమ్మక్కలాంటి అమ్మాయి గాజుల కర్రతో హాలు మధ్య సాక్షాత్కరించింది అన్నారు!" నిజమే. నాకారోజు బాగా జ్ఞాపకం. కృష్ణమూర్తిగారు దడుసుకున్నంత పనైంది. ముఖం ఎర్ర బారింది. నుదుటపట్టిన చెమట జేబురుమ్మాలుతో తుడుచుకొంటూ హడావిడిగా వచ్చి కారులో కూర్చున్నారు.

"మేంపెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నాం" సంతోషంతో తడబడింది మేష్టారి కంఠం.

బాగుంది! బాగుందికదూ? నే విన్నదేమిటో ఓ క్షణం తరవాత అర్థం అయింది. మేష్టారిని హృదయం ఉన్న మనిషిగా మార్చాలన్న నా తాపత్రయం బాగానే నెరవేరింది కదూ?

నాకూ మంచిపనే జరిగింది!

చివరికి నేనూ, పుస్తకాలూ మిగిలిపోయాం.

పరిస్థితులూ, పనులూ కూడా గమ్మత్తుగా చక్కబడుతూ ఉంటాయి.

ప్రొఫెసరు కృష్ణమూర్తిగారు స్నేహితుని చెల్లెలిని లక్షణంగా వివాహం చేసుకున్నారు.

సంసార సాగరంలో తృప్తిగా, సుష్టుగా మునిగిపోయి ఆరు నెలలు కావస్తూంది. ఇంతే అనుకుంటున్నావేమో. అంతేకాదు. ఇంత ఆస్తిపాస్తులు, అందచందాలు ఉండి, ప్రేమించే పెళ్ళాం ఉండి ఎందుకొచ్చిన మేష్టరీ అనుకున్నారు కాబోలు - సైన్సుకి స్వస్తి చెప్పి మామగారితో వ్యాపారంలో భాగస్తులవాలని ఆలోచిస్తున్నారట. బాగుంది కదూ?

నేనేమైపోయానని అనుకుంటున్నావా? పుస్తకాలు చదివిచదివి నా మెదడుకి పదును ఎక్కింది. ఆలోచనలు క్యూరియాసిటీని పెంచాయి. యూనివర్శిటీలో రిసెర్చికి వేశాను. ఇక్కడ సీటు రావడమే కాదు. స్టేట్సు నుంచికూడా రిసెర్చికి ఛాన్సు వచ్చింది! ఓ పది రోజులలో వెళ్ళిపో

తున్నాను. అక్కడ బహుశా ఏ ఫుట్ బాల్ ఆటగాణ్ణో, పాప్ పాటగాణ్ణో ప్రేమించ కుండా ఉండాలని దీవించు. మళ్లీ అక్కడి నుంచే రాస్తాను.

నీ

( ష”



చేతిలో ఉత్తరం పెట్టుకుని శున్యంలోకి చూస్తూ నవ్వుకుంటూంది పార్వతి అప్పుడే హడావిడిగా లోపలికి వచ్చిన కష్ణమూర్తి కుర్చీలోంచి లేవతీసి పార్వతిని ఉత్తరంతో సహా కౌగిట చేర్చుకున్నాడు. ‘ఎవరు?” అని అడిగాడు.

“నా స్నేహితురాలు ఉత్తరం రాసింది” ఉత్తరం చదవమని అందిస్తూ కౌగిలి విడిపించుకుంది పార్వతి.

పార్వతి లేచిన కుర్చీలోనే కూలబడ్డాడు కృష్ణమూర్తి. యథాలాపంగా చదవడం ప్రారంభించిన ఉత్తరం కుర్చీలో ముందుకి వంగి తీక్షణంగా చదవసాగాడు. గాడ్! ఉత్తరం పూర్తిచేసి శూన్యంలో చూస్తూ పక్కన కాఫీ కప్పుతో నిలబడిన పార్వతి చీరచెంగుతో నుదుట పట్టిన చెమట తుడుచుకున్నాడు.

“కథలా ఉంది కదూ?” అన్నాడు కాఫీ కప్పు అందుకుంటూ.

“ఎవరు?” అంది కొంటెగా పార్వతి.

“ఉత్తరం” అన్నాడు బెదురుగనే కృష్ణమూర్తి.

“కాదు, ఉష” అంది పార్వతి

“పోనిద్దూ, ఆ పుస్తకాల పురుగు సంగతి మన కెందుకు? ఇలారా” అంటు పార్వతిని దగ్గరికి లాక్కున్నాడు.

“నేనూ సైన్సు చదువుతాను” అనబోయిన పార్వతి పెదవులు మూసేశాడు ఆవేశం వచ్చిన కృష్ణమూర్తి.

***